రేపు వినతులు స్వీకరించనున్న మంత్రి

కలెక్టరేట్, ఆగస్టు 10: రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఈనెల 12న కలెక్టరేట్‌లో వినతులు స్వీకరించనున్నారు. ఆ రోజు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ ప్రజల విన్నపాలు వింటారని కలెక్టర్ అంబేడ్కర్ ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. రాష్ట్ర మంత్రులు ప్రతి పదిహేను రోజులకు ఒకసారి తమ జిల్లాల్లో ప్రజా వినతులు స్వీకరించే కార్యక్రమాల్లో పాల్గొనాలని సీఎం చంద్రబాబు సూచించారు. అందులో భాగంగానే మంత్రి పాల్గొంటున్నారు. కాగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శనివారం కూడా జడ్పీలో విన్నపాలు స్వీకరించారు.



ఇక భయం లేదు!

- సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు రద్దుచేసిన ప్రభుత్వం
- గత ఏడాది జూన్‌లో ప్రారంభించిన వైసీపీ సర్కారు
- అడుగడుగునా లోపాలు..
- భయపడిపోయిన ప్రజలు
- సీఎం చంద్రబాబునాయుడు నిర్ణయంపై హర్షాతిరేకాలు

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. సాంకేతికంగా ఇది సాధ్యం కాదని తేల్చేసింది. భూముల క్రయవిక్రయాలు అనేది జఠిలమైన సమస్య అని.. దీనిపై అవగాహన లేకుండా రిజిస్ట్రేషన్లు చేస్తే ఇబ్బందులు తప్పవని భావించింది. అందుకే రద్దుచేస్తున్నట్టు సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులతో సమీక్షించిన ముఖ్యమంత్రి ఈ నిర్ణయం తీసుకున్నారు. వైసీపీ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన ఈ విధానంపై ప్రజల్లో భయం ఉండేది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం దాన్ని రద్దు చేయడంతో వారిలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

రిజిస్ట్రేషన్లు సులభతరం

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిలిచిపోవడం నిజమే. శాఖపరమైన సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారు. దీనికి సంబంధించి ఉత్తర్వులు రావాల్సి ఉంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను సులభతరం చేశారు. ఎనీవేర్ రిజిస్ట్రేషన్‌తో.. రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా రిజిస్ట్రేషన్ చేసుకునే సౌలభ్యం ఉంది. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

- ఎస్ఎస్ రేవతి, సబ్ రిజిస్ట్రార్, రాజాం

విజయనగరం(ఆంధ్రజ్యోతి)/ రాజాం:
ఉమ్మడి జిల్లాలోని 42 మండలాల్లో 932 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటిలో 280 సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లను గత ఏడాది జూన్ 15న ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. ఆ గ్రామాల్లో భూ రీసర్వే ప్రక్రియ ముగిశాక సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు జరపాలని నిర్ణయించారు. ఇందుకుగాను కొంతమంది సచివాలయ సిబ్బందిని ఎంపిక చేసి శిక్షణనిచ్చారు. అయితే ఎక్కడా రిజిస్ట్రేషన్ ప్రక్రియ సవ్యంగా జరగలేదు. భూముల వివరాలన్నీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉండడంతో సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ అరకొరగా జరిగింది. సచివాలయాల్లో సర్వర్ సమస్య అధికంగా ఉండేది. రెవెన్యూ వెబ్‌ల్యాండ్‌కు అనుసంధానం కాక ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యాయి. దీంతో ఎంపిక చేసిన సచివాలయాల్లో రోజులో ఒక రిజిస్ట్రేషన్ చేసేందుకు కూడా సిబ్బంది ఆపసోపాలు పడాల్సి వచ్చేది.

ఆదిలోనే అభాసుపాలు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనే ఎప్పటికప్పుడు సర్వర్ మొరాయిస్తుంటుంది. రకరకాల సాంకేతిక కారణాలతో తరచూ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిలిచిపోతుంటుంది. అటువంటిది సొంత భవనాలు లేని సచివాలయాలకు రిజిస్ట్రేషన్ల బాధ్యతలు అప్పగించడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. అయినా సరే గత ప్రభుత్వం మొండిగా ముందుకు సాగింది. దీంతో అభాసుపాలైంది. రిజిస్ట్రేషన్లకు చాలా పరికరాలు అవసరం. కంప్యూటర్లకు సంబంధించి ప్రత్యేక డివైజ్‌లు, స్కానర్లు వంటివి ఇంత వరకూ చేరలేదు. అయితే రాజకీయ విమర్శలు వస్తాయని భావించిన వైసీపీ సర్కారు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి సిబ్బందిని సచివాలయాలకు పంపించి కొన్ని రిజిస్ట్రేషన్లు చేయించింది. దీంతో ప్రజలు కూడా సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లకు పెద్దగా ఆసక్తి చూపలేదు. అసలే భూ క్రయవిక్రయాలకు సంబంధించి ప్రక్రియ కావడంతో ప్రజలు భయపడ్డారు.

ఎనీవేర్ రిజిస్ట్రేషన్‌తో మేలు..

వాస్తవానికి ఎనీవేర్ రిజిస్ట్రేషన్ విధానంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మరింత సులభతరమైంది. క్రయ విక్రయదారులు తమ సమీపంలోని ఏ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనైనా రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు ఉంది. రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖలో ప్రతి భూమి వివరాలు ఉంటాయి. ఇప్పటికే రిజిస్ట్రేషన్ల శాఖతో రెవెన్యూ శాఖకు అనుసంధానమై ఉంది. సమగ్ర సమాచారం రెండు శాఖలకూ చేరుతుంది. ఈ పరిస్థితిలో ఉన్నఫళంగా రిజిస్ట్రేషన్లు సచివాలయాలకు అప్పగించడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి.

ప్రజల్లో భయం..

ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎక్కడికక్కడే భూకబ్జాలు, ఆక్రమణలు జరిగాయి. పైగా సచివాలయాలు వైసీపీ నేతలకు కేంద్రాలుగా మారాయి. చాలావరకూ వారి కనుసన్నల్లోనే కార్యాలయాలు నడిచాయి. ఈ నేపథ్యంలో భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు అంటే ప్రజల్లో ఒక రకమైన భయాందోళన కనిపించేది.

సోలార్ ప్రాజెక్టు.. మూలకే!

- నాడు ఉన్నతాశయంతో ప్రారంభించిన అశోక్‌గజపతిరాజు
- వైసీపీ ప్రభుత్వం వచ్చాక వదిలేసిన వైనం
- కార్పొరేషన్‌కు విద్యుత్ ఆదా.. ఆదాయం కూడా లేకపోయె



ద్వారపూడి వద్ద ప్రస్తుతం సోలార్ యూనిట్ పరిస్థితి ఇది

ఉన్నత ఆశయంతో ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ ప్లాంట్ అది. విజయనగరం కార్పొరేషన్‌కు విద్యుత్ ఆదాతో పాటు ఆదాయం సమకూర్చే ఆ ప్రాజెక్టును కేంద్ర మంత్రిగా అశోక్‌గజపతిరాజు ఉన్నప్పుడు తీసుకొచ్చారు. ఎంపీల్యాడ్స్ నిధులతో ద్వారపూడి వద్ద ప్రారంభించారు. ఆ ప్లాంట్ ద్వారా ఉత్పత్తి అయ్యే కరెంటుతో విజయనగరంలోని వీధి లైట్లను వెలిగించారు. మిగులు కరెంటును ఏపీఈపీడీసీఎల్‌కు విక్రయించారు. వచ్చిన ఆదాయంతో తాగునీటి ప్రాజెక్టును నిర్వహించారు. అలాంటి ప్రాజెక్టును కూడా వైసీపీ ప్రభుత్వం మూలకు చేర్చింది. ప్లాంట్‌లో షార్ట్‌సర్క్యూట్ అయ్యాక బాగుచేయకుండా వదిలేసింది. ఫలితంగా కోట్ల విలువ చేసే సోలార్ ప్లాంట్ నేడు పూర్తిగా ధ్వంసమై ఆనవాళ్లు లేకుండా పోయింది.

విజయనగరం (ఆంధ్రజ్యోతి):
ద్వారపూడి సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను ఆదర్శంగా నిర్వహించాలని, తొలుత విజయనగరం కార్పొరేషన్‌కు ఆసరాగా నిలపాలని, తర్వాత జిల్లాలో ఇతర చోట్ల కూడా నెలకొల్పాలని కేంద్రమంత్రిగా ఉన్నప్పుడు అశోక్‌గజపతిరాజు భావించారు. అదే లక్ష్యంతో ఎంపీ కోటా నిధులతో పాటు నగరపాలక సంస్థ నిధులను కలిపి 2017 జూలైలో ప్లాంట్‌ను ప్రారంభించారు. నెడ్‌క్యాప్ సంస్థ పర్యవేక్షణలో సావిత్రి సోలార్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ఈ యూనిట్‌ని ఏర్పాటు చేసింది. ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తి అయ్యేది. దీంతో నగరపాలక సంస్థ అవసరాలకు పోనూ మిగులు విద్యుత్‌ను విక్రయించగా ఏటా కోటీ 20 లక్షల ఆదాయం వచ్చేది. అంటే ఏడాదికి రూ.60 లక్షల ఆదాయం సమకూరేది. ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారింది. వైసీపీ ప్రభుత్వం రూ.4 కోట్ల 80 లక్షల విలువైన సోలార్ యూనిట్‌కు కనీస భద్రత కల్పించలేదు. నిర్వహణ చూడలేదు. దీంతో 2019లో ప్లాంట్‌లో షార్ట్ సర్క్యూట్ సంభవించింది. ఆ తర్వాత పనిచేయడం ఆగిపోయింది. అటు తర్వాత ఒక్కసారి కూడా వైసీపీ నేతలు ప్లాంట్ వైపు చూడలేదు. తర్వాత రోజుల్లో కేబుల్, ఇతర విడి పరికరాలు చోరీ అయ్యాయి. నగరపాలక సంస్థ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసి చేతులు దులుపుకున్నారు.

- ప్రాజెక్టు దుస్థితిపై నాడు టీడీపీ నాయకులు స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడంతో పాటు స్వయంగా ద్వారపూడి వెళ్లి ప్లాంటును పరిశీలించారు. అక్కడి పరిస్థితిపై ఆవేదన చెంది వైసీపీ ప్రభుత్వాన్ని విమర్శించారు. కాగా ప్లాంటు ఏర్పాటు చేసిన సంస్థ అగ్రిమెంట్ ప్రకారం ఆ సంస్థే మరమ్మతులు చేయాలి. నగరపాలక సంస్థ అధికారులు ఆ కంపెనీకి లేఖలు రాసినా పట్టించుకోలేదని సమాచారం.
- 2023లో 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.50 లక్షలు కేటాయించి పునరుద్ధరిస్తామని నగరపాలక సంస్థ అధికారులు చెప్పుకొచ్చారు. ఆ నిధులు మరమ్మతులకూ సరిపోవని తర్వాత మౌనం వహించారు. భద్రత లేని కారణంగా యూనిట్‌ను నగరపాలక సంస్థ డంపింగ్ యార్డు ఉన్న గుణుపూర్‌పేటకి తరలించాలని ఒకనొక దశలో అధికారులు ఆలోచించారు. అది కూడా కార్యరూపం దాల్చలేదు. సోలార్ ప్లాంట్‌కి సంబంధించి కేబుల్‌తో పాటు ప్యానల్స్ కూడా చోరీకి గురయ్యాయి. ప్రాజెక్టు స్వరూపమే మారిపోయింది. అస్తవ్యస్తంగా.. అధ్వానంగా కనిపిస్తోంది.

కూటమి ప్రభుత్వం రాకతో..

కూటమి ప్రభుత్వం రాకతో సోలార్ ప్రాజెక్టుకు మంచి రోజులు వచ్చే అవకాశం ఉంది. గత నెల చివరి వారంలో టీడీపీ నాయకులు కలెక్టర్ అంబేడ్కర్‌ని కలిసి సోలార్ యూనిట్ ఏర్పాటు లక్ష్యం, నగరపాలక సంస్థకు ఏ విధంగా ఆదాయం సమకూరేదో వివరించారు. దీనిపై ఆయన స్పందించి నగరపాలక సంస్థ అధికారులతో ఈ నెల 9న సమావేశం నిర్వహించారు. నిర్వహణ చూడాల్సిన కంపెనీకి లేఖ రాసి రప్పించాలని, నెలాఖరులోగా యూనిట్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరపాలక సంస్థ అధికారులు ఆ ప్రయత్నాల్లో వున్నారు.



నాడు ప్రాజెక్టు స్వరూపం ఇలా..



పేరు ఘనం.. బోధన అంతంతమాత్రం

- జేఎన్‌టీయూలో బోధన, బోధనేతర సిబ్బంది కొరత
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- నిస్సహాయ స్థితిలో వర్సిటీ అధికారులు



(విజయనగరం రూరల్)
జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక గురజాడ విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూ) బాలారిష్టాలు దాటడం లేదు. బోధన, బోధనేతర సిబ్బంది కొరత వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. చదువులో వెనకబడతారని వారి తల్లిదండ్రులు నిరాశ చెందుతున్నారు. నేటికీ పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేదు.

తొలుత జేఎన్‌టీయు విజయనగరం కళాశాల (కాకినాడలోని యూనివర్సిటీకి అనుబంధ కళాశాల)గా ఉండేది. దీనిని గత ప్రభుత్వం జేఎన్‌టీయూ జీవీగా మార్చింది. కానీ అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మౌలిక సదుపాయాల కల్పనలోనూ.. ఇటు బోధన, బోధనేతర సిబ్బంది నియామకల్లోనూ వెనుకబడింది. కళాశాల విద్యార్థుల వసతి గృహాల్లో కూడా నాణ్యమైన భోజనాలు అందివ్వడం లేదు. మరుగుదొడ్లు, తాగునీరు వంటి సదుపాయాలూ కల్పించలేని దుస్థితి. గత ప్రభుత్వ హయాంలో విద్యాశాఖమంత్రిగా బొత్స సత్యనారాయణ ఉన్నారు. యూనివర్సిటీలో జరిగిన వివిధ కార్యక్ర మాలకు హాజరై సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీలిచ్చారు. కానీ ఏనాడూ చర్యలు తీసుకున్నది లేదు. 41 మంది బోధన సిబ్బందిలో 21 మందిని, ఆరుగురు బోధనేతర సిబ్బందిని జెఎన్‌టీయు కాకినాడ యూనివర్సిటీ నుంచి బదిలీ చేసిన వ్యవహారంపై వివాదం నడిచింది. అప్పటి ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ హేమచంద్రా రెడ్డి సహకారంతో అప్పటి జేఎన్‌టీయూ జీవీ ఉపకులపతి ప్రసాద్‌రాజు ఈ బదిలీ ప్రక్రియను నడిపించారన్న ఆరోపణలు వచ్చాయి.. దీనిపై ఉన్నత విద్యామండలి నోరు మెదపలేదు.

- జేఎన్‌టీయూ జీవీలో బీటెక్‌లో ఏడు, ఎంటెక్‌లో ఎనిమిది కోర్సులున్నాయి. ఈ విభాగాలకు సంబంధించి ఏటా 2 వేల మంది వరకూ విద్యార్థులు ప్రవేశిస్తుంటారు. సివిల్ ఇంజినీరింగ్, ఇన్ఫర్మషన్ టెక్నాలజీ, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో రెగ్యులర్ బోధకులు లేరు. అలాగే ఇంగ్లీషు సబ్జెక్టు బోధించేందుకు కూడా రెగ్యులర్ అధ్యాపకులు లేరని సమాచారం. జెఎన్‌టీయు కళాశాలగా విజయనగరంలో ప్రారంభించినప్పుడు 8 మంది ప్రొఫెసర్స్, అసోసియేట్ ప్రొఫెసర్స్-16, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ 35 మంది ఉండేవారు. నాన్ టీచింగ్ స్టాఫ్‌కి సంబంధించి డిప్యూటీ రిజిస్ట్రార్-1, అసిస్టెంట్ రిజిస్ట్రార్-1, సూపరింటెండెంట్-1, సీనియర్ అసిస్టెంట్స్-3, ఔట్‌సోర్సింగు పోస్టులు-62 మంజూరు చేశారు. వర్సిటీ స్థాయికి ఎదిగిన తరువాత ఈ పోస్టులన్నీ పెరగాల్సి వుంది. కాని ఉన్న పోస్టుల్లోనే 40 నుంచి 50 శాతం ఖాళీగా ఉన్నాయి.

డైట్‌కు మంచి రోజులు

- ఇక 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'గా గుర్తింపు
- అభివృద్ధికి రూ.9.21 కోట్ల నిధులు విడుదల

నెల్లిమర్ల, ఆగస్టు 10: వేణుగోపాలపురంలోని ప్రభుత్వ విద్యా శిక్షణా సంస్థ (డైట్)కు మంచి రోజులు వచ్చాయి. 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' గుర్తింపు ద్వారా సమకూరే కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి కానుంది. అదనపు భవనాలతో పాటు బోధనా సామగ్రి, క్రీడా సదుపాయాలు, ఉన్నత స్థాయి గ్రంథాలయం ఏర్పాటు కానుంది.

కేంద్ర ప్రభుత్వం దశలవారీగా డైట్‌లను అభివృద్ధి చేయాలని తాజాగా నిర్ణయించింది. దేశంలోని 614 డైట్‌లలో తొలి విడతగా 125 డైట్‌లను ఎంపిక చేసింది. తొలి దశలో రాష్ట్రంలోని విజయనగరంతో పాటు శ్రీకాకుళం, కర్నూల్ డైట్‌లను అభివృద్ధి చేయనుంది. 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' లుగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో చర్యలు తీసుకుంటోంది. విజయనగరం డైట్‌కు రూ.9.21 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఏడాదిలోగా ప్రణాళిక ప్రకారం అభివృద్ధి కార్యక్రమాలు చేపడ్తారు. నిధుల్లో కేంద్ర ప్రభుత్వం 60 శాతం సర్దుబాటుచేయగా, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం భరిస్తుంది. బోధన సిబ్బంది, శిక్షణలో ఉన్న ఉపాధ్యాయ విద్యార్థులకు మరిన్ని సదుపాయాలు కల్పించనున్నారు. ఫర్నీచర్, తాగునీటి సదుపాయం, స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు, సౌర వ్యవస్థ తదితర వాటిని ఏర్పాటు చేస్తారు. అదనపు భవనాలను కూడా నిర్మిస్తారు. డైట్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు రావడంతో అటు అధ్యాపక వర్గంతో పాటు ఇటు విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



జేసీగా మాధవన్

కలెక్టరేట్, ఆగస్టు 10: జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ స్థానంలో సేదు మాధవన్ వస్తున్నారు. ఈయన ఇప్పటివరకు పార్వతీపురం ఐటీడీఏ పీవోగా పనిచేశారు. జిల్లాలో జేసీగా ఉన్న కార్తీక్ నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. అక్కడ కూడా జేసీగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈయన ఎన్నికల ముందు అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి ఇక్కడకు వచ్చారు.





ఏకమైన హృదయాలు

నాగచైతన్యతో తన నిశ్చితార్థం ఫొటోలను శోభితా దూళిపాళ్ల సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకున్నారు. ఆమె చైతూతో కలసి ఊయలలో కూర్చున్న ఫొటోలు వైరల్ అయ్యాయి. 'మన పరిచయం ఎలా జరిగితేనేం, మన హృదయాలు ప్రేమలో మమేకమయ్యాయి. విడిపోలేనంతగా అవి ఏకమయ్యాయి' అంటూ ఆమెనాగచైతన్యపై తన ప్రేమను వ్యక్తం చేశారు. నిశ్చితార్థం తర్వాత శోభిత ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన తొలి పోస్ట్ ఇదే. దీన్ని నాగచైతన్య తన ఖాతాలో రీ పోస్ట్ చేశాడు.



థియేటర్లో విజిల్స్ పడేలా... 'బచ్చన్'

నిర్మాతగా వరుస సినిమాలను నిర్మిస్తూ.. టాప్ గేర్‌లో దూసుకుపోతున్నారు టీ.జీ.విశ్వప్రసాద్. ఆయన లేటెస్ట్‌గా హరీశ్ శంకర్ దర్శకత్వంలో రవితేజ నటించిన 'మిస్టర్ బచ్చన్' నిర్మించారు. ఈ నెల 15న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ఆయన మీడియాతో ముచ్చటించారు. "ఇది కమర్షియల్ అంశాలు పుష్కలంగా ఉన్న సినిమా. మాస్ ప్రేక్షకులకు విపరీతంగా నచ్చేస్తుంది. ఈ సినిమాను హరీశ్ తన మేకింగ్ స్కిల్స్‌తో ఎక్కడికో తీసుకుపోయాడు. రవితేజ, భాగ్యశ్రీ భోర్సే మధ్యన జరిగే ప్రేమకథ అలరిస్తుంది. మిక్కీ.జే.మేయర్ మంచి పాటలను ఇచ్చారు. ఈ సినిమా అవుట్‌పుట్ అనుకున్నదాని కంటే చాలా బాగా వచ్చింది. థియేటర్లో వచ్చే యాక్షన్ సన్నివేశాలకు ప్రేక్షకుల నుంచి విజిల్స్ పడతాయి" అని చెప్పారు.



'అవతార్ 3' టైటిల్ వచ్చేసింది

'టైటానిక్', 'టెర్మినేటర్', చిత్రాలతో హాలీవుడ్‌లో అగ్ర దర్శకుడిగా ఎదిగారు జేమ్స్ కామెరూన్. ఆయన తెరకెక్కిస్తున్న 'అవతార్' సిరీస్‌లో మొదటి రెండు భాగాలు ప్రపంచవ్యాప్తంగా సరికొత్త రికార్డులను నెలకొల్పాయి. మొత్తం ఐదు భాగాలుగా 'అవతార్' సిరీస్ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే.



తాజాగా, అందరినీ ఊరిస్తున్న 'అవతార్ 3' టైటిల్‌ను దర్శకుడు విడుదల చేశారు. ఈ సినిమా టైటిల్ 'ఫైర్ అండ్ యాష్'. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "ఇందులో పండోరా గ్రహాన్ని మరింత కొత్తగా చూపెడుతున్నాను. మరిన్ని అత్యద్భుత విజువల్స్, కట్టిపడేసే భావోద్వేగాలతో మూడో భాగం ఉంటుంది. మీ అందర్నీ సంభ్రమాశ్చర్యాలకు గురిచేయడానికి ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టిస్తున్నాను" అని చెప్పారు. ఈ సినిమా వచ్చే ఏడాది, డిసెంబరు 19న విడుదల అవుతుంది.













తీరం.. కోసుకుపోతోంది

- అలల తాకిడికి కోతకు గురవుతున్న వైనం
- నేలకొరుగుతున్న మత్స్యకారుల గృహాలు
- భవిష్యత్తుపై భయం



ముక్కాం గ్రామాన్ని తాకుతున్న సముద్రం

భోగాపురం: నిన్నటి వరకు తమ జీవనాధారమైన సాగరమే నేడు కక్ష కడుతోంది. ఊళ్లపైకి దండెత్తుతోంది. తీర గ్రామాలను వణికిస్తోంది. మత్స్యకారులను కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. భోగాపురం మండలంలో సముద్ర తీరం కొన్నేళ్ల క్రితం గ్రామాలకు సుమారు 150 నుంచి 200 మీటర్ల దూరంలో ఉండేది. కొంతకాలంగా సాగర కెరటాలు పూర్తిగా తీర గ్రామాలను తాకుతున్నాయి. ముక్కాం గ్రామం ప్రస్తుతం సముద్రానికి కేవలం 15 నుంచి 20 అడుగుల దూరంలోనే ఉంది. ఏమాత్రం కెరటాల ఉధృతి పెరిగినా తీరం కోతకు గురవుతూనే ఉంది. తీరం వెంబడి ఉండే పూరిళ్లు నేల మట్టమైన సందర్భాలు ఉన్నాయి. గతంలో తుఫాన్ కారణంగా ముక్కాం సీసీ రహదారి పూర్తిగా కోతకు గురైంది. సమీపంలోని గృహాలు నేలకొరిగాయి. భోగాపురం, పూసపాటిరేగ మండలాల పరిధిలో తీరం వెంబడి అనేక గ్రామాలు ఉన్నాయి. సముద్ర నీటి మట్టం మరి కాస్త పెరిగితే అనేక గ్రామాలు కొట్టుకుపోయే పరిస్థితి ఉంది. దీంతో మత్స్యకార గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. తీరం వెంబడి రక్షణ గోడ నిర్మించాలని ముక్కాం గ్రామానికి చెందిన మత్స్యకారులు అనేక పర్యాయాలు అధికారులకు, నాయకులకు మొర పెట్టుకొన్నా ఫలితం కానరావడం లేదు. ఇప్పటికైనా నాయకులు, అధికార యంత్రాంగం స్పందించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.



కోతకు గురైన తీరం.. కొట్టుకుపోతున్న రోడ్డు

యువత సన్మార్గంలో నడవాలి

విజయనగరం క్రైం: యువత సన్మార్గంలో నడవాలని వన్‌టౌన్ సీఐ ఎస్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం రాత్రి రైల్వే స్టేషన్ ప్రాంతంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. రికార్డులు సక్రమంగా లేని 12 వాహనాలను స్టేషన్‌కు తరలించారు. మద్యం తాగి వాహనం నడుపుతున్న ఐదుగురు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న పది మంది వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రి సమయాల్లో యువత పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు తారకేశ్వరరావు, నవీన్ పడా ల్, హరిబాబు నాయుడు, నరేష్ సిబ్బంది పాల్గొన్నారు..

డీలర్లకు అవకాశంపై హర్షం

కొత్తవలస: తమ కష్టాలను అర్థం చేసుకుని.. రేషన్ సరుకులను పంపిణీకి అవకాశం కల్పిస్తున్నందుకు మండల రేషన్ డీలర్ల సంఘ అధ్యక్షుడు బి.రామలింగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు శనివారం కొత్తవలసలో సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు దెందేరులో వైద్య శిబిరం

కొత్తవలస: కొత్తవలసకు చెందిన సుబ్బలక్ష్మీ చారిటబుల్ ట్రస్టు, విశాఖకు చెందిన మహాత్మాగాంధీ క్యాన్సర్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆధర్యంలో దెందేరు గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ట్రస్టు చైర్మన్ కనకాల శివ తెలిపారు. 30 సంవత్సరాలు దాటిన మహిళలకు గర్భాశయ క్యాన్సర్‌కు సంబంధించి వైద్య పరీక్షలను నిర్వహించనున్నట్టు తెలిపారు.

సర్పంచ్‌లకు శిక్షణ

బొబ్బిలి రూరల్: మండలంలోని అన్ని పంచాయతీల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఈనెల 12 నుంచి 14 తేదీ వరకు 3 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్టు ఎంపీడీఓ రవికుమార్ తెలిపారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు తప్పకుండా పాల్గొనాలని కోరారు.

రాజకీయ జోక్యం తగదు

బొబ్బిలి రూరల్: పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికల్లో రాజకీయ జోక్యం తగదని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు ఆకుల దామోదర్ అన్నారు. పాఠశాల అభివృద్ధికి సహకరించని ప్రజాప్రతినిధులకు, రాజకీయ పార్టీలకు ఎస్ఎంసీ ఎన్నికలతో సంబంధం ఏమిటని ప్రశ్నించారు. బొబ్బిలిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ పార్టీల్ల అభర్థులు గెలిచారంటూ టీడీపీ, వైసీపీ నేతలు నిస్సిగ్గుగా ప్రకటనలు చేసుకోవడం సిగ్గు చేటన్నారు.

షటిల్ టోర్నమెంట్

బొబ్బిలి రూరల్: యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా శనివారం బొబ్బిలిలో షటిల్ టోర్నమెంట్ నిర్వహించారు. విన్నర్స్‌గా ఏటీసీ నాయుడు, జి.రవికుమార్, రన్నర్స్‌గా జి.సింహాచలం, శ్రీధర్ నిలిచారు. విజేతలను యూటీఎఫ్ రాష్ట్ర మహిళా నాయకురాలు విజయగౌరి, సభ్యులు అభినందించారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు ఆపండి

బొబ్బిలి రూరల్: బొబ్బిలిలో శనివారం శ్రీనిధి పాఠశాలలో ఏపీటీఎఫ్ ప్రాంతీయ సమావేశం జిల్లా అధ్యక్షుడు యం.బలరామినాయుడు అధ్యక్షతన నిర్వహిం చారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు ఎ.సదాశివరావు పాల్గొని, మాట్లాడారు. అక్టోబరు 6, 7, 8 తేదీలలో జరగబోయే వైజ్ఞానిక మహా సభలను విజయ వంతం చేయాలని కార్యకర్తలకు కోరారు. ఇందులో భాగంగా మహాసభల పోస్టర్‌ను విడుదల చేశారు. అనం తరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.ఈశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖామంత్రి జీవో 117 రద్దు చేస్తామని హామీ మేరకు వెంటనే రద్దు చేసి ప్రస్తుతం సర్దుబాటు ప్రక్రియ ఆపి పదోన్నతులు చేపట్టాలని, తద్వారా పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతను భర్తీ చేయవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్ సీహెచ్ వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షుడు గంట సత్యనారాయణ, కార్యదర్శులు కె.సత్యారావు, ఎస్.సూర్యనారాయణ, బొబ్బిలి, రామభద్రపురం, బాడంగి. తెర్లాం, దత్తిరాజేరు మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు

రామభద్రపురం: గ్రామ పంచాయతీలో నెలకొన్న వివిధ సమస్యలపై దృష్టిపెట్టిన పంచాయతీరాజ్ శాఖా మంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్‌కు సర్పంచ్‌ల ఆధ్వర్యంలో కృతజ్ఞతలు తెలుపుతున్నామని జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మజ్జి రాంబాబు తెలిపారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో గ్రామ పంచాయతీలు పూర్తిగా నిర్వీర్యం అయ్యాయని, దీంతో సర్పంచ్‌లంతా ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయారన్నారు. ఇటువంటి తరుణంలో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం స్పందించడం ఎంతో హర్షణీయమని అన్నారు. స్వాతంత్రోత్సవ వేడుకలకు గతంలో పంచాయతీలకు వంద రూపాయలు చెల్లించేవారని, ఇప్పుడు దానిని రూ.10వేలకు పెంచడం హర్షణీయమన్నారు. పంచాయతీలకు వివిధ గ్రాంటులలో రావాల్సిన నిధుల విషయంలో కూడా ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ఇటీవల పంచాయతీరాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వైవీబీ.రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సర్పంచ్‌ల సమస్యలపై మంత్రి పవన్‌కళ్యాణ్‌కు వినతిపత్రం ఇచ్చామని, దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. పంచాయతీ పాలనలో సర్పంచ్‌లకు అధిక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారని అన్నారు. మండలంలో ఈ నెల 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకు పంచాయతీ పాలనపై సర్పంచ్‌లకు శిక్షణా కార్యక్రమాలు అమలు చేయనున్నారని, సర్పంచ్‌లంతా హాజరై శిక్షణా కార్యక్రమా న్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో దుప్పలపూడి సర్పంచ్ వైకుంఠం విజయభాస్కర్ పాల్గొన్నారు.

భైరిసాగరం సంగతి అంతేనా?

బొబ్బిలి: పాత బొబ్బిలికి చెందిన భైరిసాగరం చెరువు సుందరీకరణ పనుల కోసం రూ.1.10 కోట్లతో చేపట్టిన పనులు ఎక్కడివక్కడ నిలిచిపోయాయి. గత వైసీపీ హయాంలో బుడా నుంచి నిధులను మంజూరు చేయించారు. ప్రస్తుతం తెలుగుదేశం ప్రభుత్వం బుడా నిధుల వినియోగానికి సంబంధించి ఆచితూచి అడుగు వేస్తున్నందున ఈ పనులు తిరిగి ఎప్పుడు ప్రారంభమవుతాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. గత ఏడాది అప్పటి ఎమ్మెల్యే శంబంగి ఈ పనులకు శంకుస్థాపన చేశారు. 700 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉన్న చెరువు ఆ క్రమణలకు గురైనట్లు గుర్తించామని ప్రకటించారు. కానీ ఆ ఆక్రమణలను తొలగించేందుకు తీసుకున్న చర్యలు మాత్రం శూన్యం. భైరిసాగరాన్ని ఆధునీకరిస్తే పర్యాటక ప్రాంతంగా మారడం ఖాయం. ఆ చెరువు ఒడ్డున బొబ్బిలి యుద్ధ స్మారక స్తంభం ఉన్నందున దానిని చూసేందుకు పర్యాటకులు వచ్చేందుకు అవకాశం ఉంది.



గత ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేస్తున్న చేస్తున్న అప్పటి ఎమ్మెల్యే శంబంగి (ఫైల్)



భైరి సాగరం చెరువు

కాంట్రాక్టరుతో చర్చిస్తున్నాం

భైరిసాగరం చెరువు సుందరీకరణ పనులకు సంబంధించిన కాంట్రాక్టరుతో చర్చిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ పనులను పూర్తి చేయించేందుకు తగిన చర్యలు తీసుకుంటాం. ఎమ్మెల్యే అభిప్రాయాలను తీసుకొని నివేదిస్తాం.

-లాలం రామలక్ష్మి, మున్సిపల్ కమిషనర్, బొబ్బిలి

రోడ్ల మరమ్మతులకు శ్రీకారం



బొబ్బిలి పట్టణంలో పాడైన రోడ్లను బాగు చేయిస్తున్న దృశ్యం

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలోని వివిధ ప్రాంతాలలో మృత్యు మార్గాలుగా మా రుతున్న రహదారుల మరమ్మతులకు అధికారులు శ్రీకారం చుట్టారు. రు. శుక్రవారం ఈ రోడ్డులో యంత్రాలతో పెద్దగుంతలన్నిటినీ పూడ్చేందుకు చర్యలు చేపట్టారు. నాయకులు, అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు పనులు చేపడుతున్నందుకు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరం

బొబ్బిలి రూరల్: బొబ్బిలి రోటరీ క్లబ్, ఎస్ఆర్ఐ హాస్పిటల్ సంయుక్త నిర్వహణలో రోటరీ క్లబ్ అధ్యకులు సంద్రీ శ్రీనివాసన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఎస్ఆర్ఐ హాస్పిటల్ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ వైద్యశిబిరానికి గుండె, మూత్రపిండాలు, కీళ్ల నొప్పులు, టీబీ, జ్వరాలు, ఆస్తమా డయాబెటిస్, గ్యాస్ట్రిక్ సమస్యలతో బాధపడుతున్న రోగులను డాక్టర్ అభినయ్ పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. అవసరమైన రోగులకు బీపీ, చక్కెర స్థాయి పరీక్షలతో పాటు రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ జిల్లా చైర్మన్ జేసీ రాజు మాట్లాడుతూ రోటరీ సంస్థ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తుందని, వైద్య శిబిరాల ద్వారా సామాన్య ప్రజలకు, పేదలకు వైద్య సేవలు అందిస్తామన్నారు.

పర్యావరణ రక్షణ ధ్యేయం

వేపాడ: మండలంలోని జగ్గయ్యపేట గ్రామంలో హరిత ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ(హర్ష్) స్వచ్ఛంద సంస్థ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్రాంత వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్(శ్రీకాకుళం) రమణమూర్తి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హర్ష్ సంస్థ పర్యావరణ రక్షణకు రెండు జిల్లాల్లో పని చేయడం అభినందనీయమన్నారు. అనంతరం మొక్కలు నాటారు.

గుంటూరు సదస్సులో రాపర్తి

కొత్తవలస, ఆగస్టు 10 : వికలాంగులతో జీవించే పిల్లల హక్కుల పరిరక్షణపై గుంటూరులో నిర్వహించిన కార్యక్రమంలో గురుదేవ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు పాల్గొన్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాకూర్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో దివ్యాంగులకు సంబంధించిన అంశాలపై జగదీష్‌బాబు ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు నరేంద్ర, వి.సుజాత, వి.ఆర్.కె. కృపాసాగర్, జ్యోతిర్మయి ప్రతాప, గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.



మాట్లాడుతున్న జగదీష్ బాబు

ఆధిక్యంలో తూర్పు గోదావరి జట్టు



విజ్జీ స్టేడియంలో విజయనగరం, తూర్పుగోదావరి జట్ల మధ్య మ్యాచ్ సాగుతున్న దృశ్యం

విజయనగరం టౌన్: జిల్లా కేంద్రంలోని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా క్రికెట్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగుతున్నాయి. తొలి ఇన్నింగ్స్‌లో విజయనగరం జట్టుపై తూర్పు గోదావరి, శ్రీకాకుళం జట్టు పై విశాఖ జట్టు ఆధిక్యం సాధించాయి. సర్ విజ్జీ మైదానంలో విజయనగరం-తూర్పుగోదావరి జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో తూర్పుగోదావరి జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 250 పరుగులకు, విజయనగరం జట్టు 199 పరుగులకు ఆలౌటయ్యాయి. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన తూర్పు గోదావరి జట్టు ధాటిగానే బ్యాటింగ్ చేసింది. సాయంత్రం 4.30 గంటల సమయానికి మూడు వికెట్లు కోల్పోయి 124 పరుగులు సాధించింది.

విశాఖకు 221 పరుగుల ఆధిక్యం

చింతలవలసలోని డాక్టర్ పీవీజీ రాజు నార్త్‌జోన్ క్రికెట్ అకాడమీ మైదానంలో విశాఖపట్టణం- శ్రీకాకుళం జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో విశాఖ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 330 పరుగులకు ఆలౌట్ కాగా.. శ్రీకాకుళం జట్టు 209 పరుగులకు ఆలౌటైంది. విశాఖ జట్టుకు 221 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన విశాఖ జట్టు ఆట ముగిసే సమయానికి 23 ఓవర్లలో నాలుగు వికెట్లు నష్టపోయి 83 పరుగులు సాధించింది.

గురజాడ గృహాన్ని పరిరక్షించండి



మంత్రి కొండపల్లికి వినతిపత్రం అందిస్తున్న భీశెట్టి

విజయనగరం దాసన్నపేట: మహాకవి గురజాడ అప్పారావు గృహం మురికికూపంగా మారిపోయిందని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బి.బాబ్జీ అన్నారు. శనివారం రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురజాడ అప్పారావు గృహం చుట్టుపక్కల ముళ్ల చెట్లతో మురికికూపంగా తయారైందన్నారు. ఏటా గురజాడ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించడం, తరువాత వదిలేయడం అనవాయితీగా వస్తోందన్నారు. మంత్రిని కలిసిన వారిలో సంఘ నాయకులు నాగభూషణం, రాజారావు, పీఎల్ఎన్ రాజు, రామ్మోహనరావు, రామచంద్రరావు, ప్రభాకరరావు తదితరులు ఉన్నారు.

అద్దె భవనాల్లోనే..

- అంగన్‌వాడీ కేంద్రాలకు లేని సొంత నిర్మాణాలు
- మండలంలో సగానికి పైగా ఇదే దుస్థితి

రామభద్రపురం: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. మొత్తం 64 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వీటిలో 37 కేంద్రాలు అద్దెకొంపల్లోనూ, పరాయి భవనాల్లోనూ నడుస్తున్నాయి. చిన్న పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందించే అంగన్‌వాడీలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి పెట్టకపోవడంతో కేంద్రాల్లో ఉన్న నిర్వాహకులు, పిల్లల ఇక్కట్లు వర్ణనాతీతం. సు మారు 2,223 మంది పిల్లలకు ఈ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందుతోంది. 179 మంది గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నారు. చాలా గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. చాలా గ్రామాల్లో మంజూరైన భవనాలు నిర్మించకపోవడం, నిర్మించినా ప్రభుత్వానికి అందించకపోవడం వంటి చర్యలు కోకొల్లలు. సోంపురం గ్రామంలో అంగన్‌వాడీ భవనం నిర్మాణం పూర్తయినప్పటికీ కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లించకపోవడంతో ఆ భవనాన్ని అధికారులకు అప్పగించలేదు. అలాగే శిష్టుసీతారాంపురం గ్రామంలో అంగన్‌వాడీ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో పంచాయతీ కార్యాలయంలో పిల్లలకు ఆహారం అందిస్తున్నారు. ఇట్లామామిడిపల్లి గ్రామంలో 2 అంగన్‌వాడీ కేంద్రాలు అద్ద భవనంలోనే ఉంటున్నాయి. జీలికవలస గిరిజన గ్రామంలో ఉన్న మినీఅంగన్‌వాడీ కేంద్రం పూరిపాకలోనే మగ్గుతోంది. ఈ షైటెక్ పాలనలో కూడా ఈ విధంగా అంగన్‌వాడీ కేంద్రాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి.



జీలికవలసలో పూరిపాకలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం



ఎస్.సీతారాంపురంలో పంచాయతీ భవనంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

రోడ్డు ప్రమాదంలో ఏవో మృతి



ఉమామహేశ్వర నాయుడు(ఫైల్)

విజయనగరం రూరల్, ఆగస్టు 10: రోడ్డు ప్రమాదంలో మండల వ్యవసాయ శాఖాధికారి మృతి చెందిన ఘటన నగరంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎం.ఉమామహేశ్వర నాయుడు(58) విజయనగరం మండల వ్యవసాయాధికారిగా మూడేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. స్థానిక ఆర్అండ్‌బీ రోడ్డులో కుటుంబంతో కలిసి నివసిస్తున్నారు. శుక్రవారం రాత్రి అర్అండ్‌బీ రోడ్డు నుంచి ఎత్తురోడ్డు జంక్షన్ వైపు బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడడంతో స్థానికులు విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. ఇతని స్వగ్రామం శృంగవరపుకోట కాగా ఈయన భార్య రెండేళ్ల క్రితం మరణించింది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

- రైతులకు నిత్యం అందుబాటులో ఉండే వ్యవసాయాధికారిగా పేరు తెచ్చుకున్న విజయనగరం మండల అధికారి ఎం.ఉమామహేశ్వరనాయుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పట్ల ఏపీ రైతు సంఘం ఒక ప్రకటనలో సంతాపం తెలిపింది. ఈ మేరకు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి రాంబాబు ఒక ప్రకటన విడుదల చేస్తూ, మంచి వ్యవసాయాధికారిని కోల్పోయినట్టు అయ్యిందన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఏవో మృతికి ఎంపీడీవో గంటా వెంకటరావు, తహసీల్దారు ఎస్.కూర్మానాథరావుతో పాటు, మండలం లో ని అధికారులు, మండల పరిషత్ సిబ్బంది, వ్యవసాయశాఖ సిబ్బంది తదితరులు సంతాపం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



రోషన్ (ఫైల్)

పార్వతీపురంటౌన్, ఆగస్టు 10: గుర్తు తెలియని వాహనం ఢీకున్న ఘటనలో యువకుడు మృతి చెందాడు. ఔట్ పోస్టులు, మృతుడు బంధువులు ఇచ్చిన సమాచారం మేరకు విశాఖపట్నం జిల్లా కొత్త గాజువాక, గణేష్‌నగర్‌కు చెందిన షేక్ రోషన్(26) గత కొంత కాలంగా ఇంటి సీలింగ్ పనుల్లో కూలీగా పనిచేస్తూ పట్టణంలోని బంగారమ్మ కాలనీలో నివాసముంటున్నాడు. గత అర్ధరాత్రి తన పనులు ముగించుకుని వెంకంపేట నుంచి వస్తుండగా బెలగాం శివారుల్లోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీంది. ఈ ప్రమాదంలో రోషన్ అక్కడికక్కడే మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఔట్ పోస్టు పోలీసులు తెలిపారు.

ఇంటికొస్తున్నానని చెప్పి..

- రైల్వే ట్రాక్‌పై యువకుడి మృతి



కార్తీక్ (ఫైల్)

భామిని: మండలానికి చెందిన యువకుడు శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస రైల్వే ట్రాక్‌పై అనుమానాస్పదంగా మృతి చెందాడు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని దిమ్మిడిజోల గ్రామానికి చెందిన వలరౌతు కార్తీక్ (25) హైదరాబాద్‌లో 3 సంవత్సరాలుగా ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం ఇంటికి వస్తున్నానని, బయలుదేరానని తల్లితండ్రులైన సావిత్ర, అప్పలసూరికి ఫోన్‌లో తెలిపాడు. కానీ ఆ తర్వాత కుమారుడి వద్ద నుంచి ఎటువంటి ఫోన్ రాలేదు. ఈ క్రమంలో శుక్రవారం ఆమదాలవలస రైల్వే పోలీసులు ట్రాక్‌పై మృతదేహాన్ని గుర్తించి, కార్తీక్ తల్లితండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటిన ఆమదాలవలస చేరుకుని ట్రాక్‌పై విగతజీవిగా పడి ఉన్న కుమారుడి మృతదేహం చూసి విలపించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి శ్రీకాకుళం రిమ్స్‌కు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. శనివారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. అయితే మృతికి గల కారణాలు తెలియవని, హైదరాబాద్ నుంచి ట్రెయిన్‌లో దిగి ఆమదాలవలస రైల్వే ట్రాక్‌పై మృతి చెందడం అనుమానాస్పదంగా ఉందని తల్లిదండ్రులు రోదిస్తున్నారు.

భూ వివాదంలో ఏడుగురిపై కేసు

రేగిడి: మండలంలోని నాయిరాలవలస గ్రామంలో ఇద్దరు అన్నదమ్ముల మధ్య తలెత్తిన భూవివాదంలో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటనలో శనివారం ఏడుగురిపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ ఎం.రాజారావు తెలిపారు. ఈ ఘటనపై ఏఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాయిరాలవలసకు చెందిన వావిలపల్లి శ్రీనివాసరావు, వావిలపల్లి తిరుపతిరావు అనే అన్నదమ్ముల మధ్య గత కొంతకాలంగా భూవివాదం నడుస్తోంది. ఈక్రమంలో ఈనెల 9న శ్రీనివాసరావు భార్య భారతికి మరిది తిరుపతిరావు మధ్య భూవాటాల కోసం మాటమటా పెరిగి గొడవకు దారితీసింది. ఈ ఘటనలో భారతిపై మరిది తిరుపతిరావు, తోటికోడలు రామలక్ష్మి, అత్త అన్నపూర్ణ దాడిచేసి గాయపరిచినట్టు ఆమె పోలీసులకు ఫిర్యాదుచేసింది. ఇదిలా ఉండగా.. ఇదే ఘటనలో తనపై కొడుకు శ్రీనివాసరావు, కోడలు భారతి, ఇదే వివాదంలో పెద్దలుగా వ్యవహరించిన చిట్టినాయుడు, అశిరినాయుడు దాడి చేసి, గాయపరిచారని అన్నపూర్ణ పోలీసులను ఆశ్రయించింది. ప్రస్తుతం ఫిర్యాదుదారులు ఇద్దరూ రాజాం ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారు. పరస్పరం అందిన ఫిర్యాదుల మేరకు ఏడుగురిపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సీసాలు పట్టివేత

శృంగవరపుకోట: శృంగవరపుకోట పట్టణంలో శనివారం ఎస్ఈబీ పోలీసులు 18 మద్యం సీసాలను పట్టుకున్నారు. మద్యం తరలిస్తున్న ఈశ్వరరావుతో పాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు. ఎస్ఈబీ ఎస్.ఐ ఫణీంద్ర, హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్, పీసీ అశోక్‌కుమార్ వున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

రాజాం రూరల్: రాజాం పట్టణంలోని వస్త్రపురి కాలనీ సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా, శనివారం రాత్రి అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ దాడి మోహన్‌రావు తెలిపారు. బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్న వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా లావేరు వెంకటాపురం గ్రామానికి చెందిన చందక లక్ష్మనాయుడు ఈనెల 4వ తేదీన తన భార్య మహాలక్ష్మితో కలిసి ద్విచక్రవాహనంపై తన స్వగ్రామం వెళ్తున్నాడు. బొబ్బిలి నుంచి రాజాం మీదుగా వెళ్తుండగా పట్టణంలోని వస్త్రపురి కాలనీ సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో లక్ష్మనాయుడికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం ఆయన శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనదారుడి నిర్లక్ష్యం వల్లే తన భర్తకు తీవ్ర గాయాలయ్యాయని మహాలక్ష్మి శనివారం రాత్రి రాజాం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మోటారు చోరీ

రాజాం రూరల్: ఒమ్మి గ్రామంలో వ్యవసాయ బావికి సంబంధించిన మోటారు చోరీకి గురైంది. బాధితుడు వంగా మహేష్ శనివారం రాత్రి రాజాం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు టౌన్ సీఐ దాడి మోహనరావు తెలిపారు.

‘ఉపాధి’ వేతనమేదీ?

- జిల్లాలో రూ.5కోట్లకు పైగా నిధులు పెండింగ్
- ఏడు నెలలుగా అందని వేతనాలు
- ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఉపాధి కూలీలు



వెదుళ్లవలసలో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు (ఫైల్)

గరివిడి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలు వేతనాల కోసం ఎదురు చూస్తున్నారు. జిల్లాలో సుమారుగా 3లక్షల 60 వేల కుటుంబాలకు ఉపాధిహామీ పథకంలో జాబ్ కార్డులు ఉన్నాయి. ఈ జాబ్ కార్డుల ద్వారా విడత విడతలుగా 5 లక్షల 93 వేలమంది వేతనదారులు ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్నారు. వీరికి గతంలో నెలకు మూడు విడతలుగా బ్యాంకుల ద్వారా వేతనం జమ అయ్యేది. అయితే గత ఏడు నెలలుగా కేంద్ర ప్రభుత్వం ఉపాధి వేతనాలకు సంబంధించిన నిధులు మంజూరు చేయలేదు. దీంతో జిల్లాలోని ఒక్క వేతనదారుడు కూడా వేతనం అందుకోలేదు. జిల్లాలోని వేతనదారులకు సుమారు రూ.6కోట్లు చెల్లించాల్సిన డబ్బులు పెండింగ్‌లో ఉన్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో వేతనదారులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్ల గృహ నిర్మాణ పనులు ఆగిపోవడం, జిల్లాలో చాలా పరిశ్రమలు మూతపడి ఉండడం వల్ల తమకు కూలి పనులు దొరకడం లేదని, కనీసం తాము పనిచేసిన ఉపాధిహామీ పథకంలో బకాయి డబ్బులైనా అందితే బాగుంటుందని వేతనదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ సమస్యను ప్రజాప్రతినిధులు, అధికారులు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఉపాధిహామీ వేతనదారులు కోరుతున్నారు.

మంజూరైన వెంటనే చెల్లిస్తాం..

జిల్లాలో పెండింగ్ ఉన్న ఉపాధి వేతనాల సమస్యపై ఉపాధి హామీ పథకం జిల్లా పీడీ జి.ఉమాపరమేశ్వరిని ఫోన్‌లో ప్రస్తావించగా, కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు అయిన వెంటనే వేతనదారులకు చెల్లింపులు చేపడతామని తెలిపారు.

రాష్ట్ర స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో రాము

నెల్లిమర్ల: త్వరలో జరుగనున్న రాష్ట్ర స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకుగాను జిల్లా జట్ల ఎంపిక కొండవెలగాడ గ్రామంలో శనివారం నిర్వహించినట్టు వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చల్లా రాము తెలిపారు. ఆయన శనివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. బాలికల విభాగంలో 40 కిలోల కేటగిరీలో ఎం.పావని, 45 కిలోల కేటగిరిలో బి.నీరజ, బి.రాజకుమారి, ఆర్.భవాని, 49 కిలోల విభాగంలో బి.చంద్రిక, వి.రమాదేవి, 55 కిలోల విభాగంలో కె.భార్గవి, ఎన్.సుస్మిత, 59 కిలోల విభాగంలో ఎం.శ్రీలక్ష్మి, జి.శ్రావణి, సీహెచ్.కీర్తన ఎంపికయ్యారని చెప్పారు. అలాగే 64 కిలోల విభాగంలో ఎ.యశశ్రీ, ఎస్.పల్లవి, 71 కిలోల విభాగంలో బి.నాని, 81 కిలోల విభాగంలో సీహెచ్.శ్రీలక్ష్మి, 87 కిలోల విభాగంలో వై.వైతకుమారి, 87 ప్లస్ విభాగంలో వై.ప్రజ్ఞకుమారి, టి.సత్యజ్యోతి ఎంపికయినట్లు ఆయన తెలియజేశారు. బాలుర విభాగంలో కె.సతీష్, బి.రామ్‌జీ, టి.తలుపులు, నాయుడు, జి.కిరణ్, బి.కార్తీక్, కె.సుధీర్, బి.లోకేష్, కె.దినేష్‌కుమార్, ఎస్.ఆనంద్, ఎస్.భాస్కర్, కె.అనిల్‌కుమార్, ఎ.లిఖిత్, బి.ఆదినారాయణ, వి.నరసింహనాయుడు, వి.రాము, ఆర్.రాంబాబు ఎంపికయినట్లు తెలిపారు. ఎంపిక పోటీల నిర్వహణలో పి.వెంకటేష్, వై.ఎ.కుమారి, ఆర్ఎల్.గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీల్లో కొండగుంపాం విద్యార్థుల ప్రతిభ

నెల్లిమర్ల: ఏపీ జీవ వైవిధ్య మండలి ఆధ్వర్యంలో విజయనగరంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన పలు పోటీల్లో మండలంలోని కొండగుంపాం గ్రామ ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించారు. జిల్లా స్థాయి డిబేట్ పోటీల్లో ఈ పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానాన్ని, లఘు చిత్ర పోటీల్లో తృతీయ స్థానాన్ని సాధించినట్టు హెచ్ఎం వేణుగోపాల్ తెలిపారు. ఈ బహుమతులను డీఈవో ప్రేమ్‌కుమార్ చేతులమీదుగా విద్యార్థులు స్వీకరించారని ఆయన తెలిపారు. వీరికి తర్ఫీదునిచ్చిన సైన్స్ ఉపాధ్యాయుడు సత్యప్రకాష్‌ను, విజేతలుగా నిలిచిన విద్యార్థులను హెచ్ఎం వేణుగోపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

శిక్షణను వినియోగించుకోండి



మాట్లాడుతున్న కృష్ణమోహన్

నెల్లిమర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గత మూడు రోజుల పాటు సర్పంచ్‌లుకు, పంచాయితీ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఏపీఎస్ఐఆర్‌డీ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్ శనివారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. శిక్షణా కార్యక్రమాన్ని సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం సీతారామునిపేట గ్రామంలోని ఎస్‌డబ్ల్యూపీసీ సెంటర్‌ను సర్పంచ్‌లు, కార్యదర్శులు పరిశీలించారు.

సమన్వయంతోనే గ్రామాభివృద్ధి

రాజాం: సర్పంచ్‌లు, కార్యదర్శులు సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు అన్నారు. శిక్షణా కార్యక్రమంలో భాగంగా మూడోరోజు శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాల యంలో రిఫ్రెషర్ కోర్సు నిర్వహించారు. పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, చెత్త సంపద కేంద్రాల నిర్వహణ విషయంలో ఉభయులు కలిసికట్టుగా పనిచేయాలని ఎంపీడీవో సూచించారు. చెత్త సంపద కేంద్రాల విషయంలో ప్రత్యేక దృష్టి సారిస్తే పంచాయతీలకు ఆదాయం వస్తుందన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ లక్ష్మణరావు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి తోడ్పడాలి

సంతకవిటి: శిక్షణలో నేర్చుకున్న అంశాలపై సర్పంచ్‌లు అవగాహన పెంచుకుని గ్రామాభివృద్ధికి తోడ్పడాలని ఎంపీడీవో జి.పైడితల్లి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈసందర్భంగా ఆమె సర్పంచ్‌లకు వివిధ సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ పుష్పాంజలి, పరిపాలన అధికారి రఘునాథాచారి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ



శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీవో

రేగిడి: పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక కార్యచరణతో ముందుకు వెళ్లాలని ఎంపీడీవో శ్యామలాకుమారి, ఈవోఆర్డీ సత్యనారాయణ, రిసోర్స్‌పర్సన్లు గోపాల్‌రావు, హేమసుందరావు, రాజేంద్ర పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధిపై సర్పంచ్, కార్యదర్శుల శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

కెంబూరి కుటుంబానికి కళా పరామర్శ



కెంబూరి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కళా, కేఏ నాయుడు

చీపురుపల్లి: దివంగత మాజీ ఎంపీ కెంబూరి రామ్మోహనరావు కుటుంబాన్ని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు శనివారం పరామర్శించారు. కెంబూరి ఈనెల 8న విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో తుది శ్వాస విడిచిన విషయం తెలిసిందే. కాగా, శనివారం చీపురుపల్లి పట్టణానికి వచ్చిన ఎమ్మెల్యే.. లావేరు రోడ్డులోని కెంబూరి నివాసానికి వెళ్లి, ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కుటుంబాన్ని పరామర్శించారు. ఆయనతో పాటు గజపతినగరం మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున, స్థానిక నాయకులు దన్నాన రామచంద్రుడు, గవిడి నాగరాజు, రౌతు రమేష్‌నాయుడు, సారేపాక సురేష్, బలగం వెంకటరావు ఉన్నారు.

చురుగ్గా అన్న క్యాంటీన్ పనులు



సిద్ధమవుతున్న అన్న క్యాంటీన్

రాజాం: అన్న క్యాంటీన్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. స్థానిక ఎల్లమ్మగుడి వెనుక భాగంలో ఈ పనులను చేపడుతున్నారు. గతంలో కూడా ఇక్కడే క్యాంటీన్ నిర్వహించేవారు. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల పొట్టకొట్టడానికి అన్న క్యాంటీన్లను ఎత్తివేసింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించాలని నిర్ణయించింది. ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఆదేశాల మేరకు మున్సిపాల్టీ అధికారులు దగ్గరుండి క్యాంటీన్ పనులు చేపడుతున్నారు. సెప్టెంబరు నెలలో అన్న క్యాంటీన్‌ను ప్రారంభించాలని ఎమ్మెల్యే నిర్ణయించడంతో పనులు వేగంగా చేపడుతున్నారు.

వండానిపేటకు కదిలిన వైద్య సిబ్బంది

- జ్వరాలపై అప్రమత్తం



రోగుల యోగక్షేమాలు తెలుసుకుంటున్న రేగిడి పీహెచ్‌సీ సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రేగిడి: వండానిపేట గ్రామంలో ప్రబలుతున్న జ్వరాలపై స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది శనివారం స్పందించారు. వైద్యాధికారి అసిరినాయుడు, డాక్టర్ వి.సోహని రాఘవ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. పారిశుధ్య చర్యలు చేపట్టారు. ‘వండానిపేటలో జ్వరాలు’ శీర్షికన ‘ఆంధ్రజ్యోతి’లో శనివారం కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిపై వైద్య సిబ్బంది స్పందించి.. ఇంటింటి సర్వే నిర్వహించి బాధితులకు సేవలందించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన శిబిరానికి 26 మంది హాజరుకాగా, వీరిలో 8మంది నుంచి రక్తనమూనాలు సేకరించారు. స్థానిక సర్పంచ్ వి.కల్యాణి చక్రపాణి, కార్యదర్శి రామ్‌కుమార్ తదితరులు పర్యవేక్షించారు.

పాఠశాల నిర్మాణానికి స్థల పరిశీలన



మ్యాప్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ సురేష్

భోగాపురం: మండలంలోని బైరెడ్డిపాలెం గ్రామంలో ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి తహసీల్దార్ ఎం.సురేష్ శనివారం స్థల పరిశీలన చేశారు. ఇక్కడ ఉండే ప్రాథమిక పాఠశాలను అంతర్జాతీయ విమానాశ్రయ ఏర్పాటులో భాగంగా రన్‌వే కోసం తొలగించారు. అయితే పాఠశాల నిర్మాణానికి అవసరమైన నిధులు అధికారుల ఖాతాల్లో జమయ్యాయి. మళ్లీ నూతనంగా పాఠశాల నిర్మించేందుకు అవసరమైన స్థలాన్ని సేకరిస్తున్నారు. ఈ మేరకు స్థల పరిశీలన చేశారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ తోపాటు సర్వేయర్ మధుకేశ్వరరావు, వీఆర్వోలు ఉన్నారు.

నేడు ఒట్టిగెడ్డ నుంచి నీరు విడుదల

జియ్యమ్మవలస: మండలంలోని ఒట్టిగెడ్డ రిజర్వాయర్ నుంచి ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆదివారం ఉదయం 11 గంటలకు నీటిని విడుదల చేయనున్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 382 అడుగులు నీరు ఉన్నట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు.

జగన్ పాలనలో దళితులు దగా పడ్డారు

- ఎమ్మెల్యే కోండ్రు

రాజాం: జగన్‌రెడ్డి పాలనలో దళితులు దగా పడ్డారని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ శనివారం ఒక ప్రకటనలో తీవ్రంగా విమర్శించారు. విజయవాడ అంబేద్కర్ విగ్రహానికి ఉన్న జగన్మోహన్‌రెడ్డి పేరును గుర్తు తెలియని ఆగంతుకులు తొలగిస్తే వైసీపీ నేతలు దానిని టీడీపీ ప్రభుత్వంపై ఆపాదించడం ఏమిటని ప్రశ్నించారు. విదేశీ విద్యకు అంబేద్కర్ పేరు మార్చి జగన్ తనపేరు పెట్టుకున్నపుడు వైసీపీ దళిత నేతలు ఎందుకు నోరుమెదపలేదని ఆయన ప్రశ్నించారు. అంబేద్కర్ విగ్రహంపై చిన్న గీత కూడా పడలేదు కానీ విగ్రహం ధ్వంసం చేస్తున్నారంటూ తప్పుడు ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు.

టీడీపీలో 50 కుటుంబాల చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న అప్పలనాయుడు

సంతకవిటి: మండలంలోని చిత్తారపురం పంచాయతీ నారన్నాయుడుపేట గ్రామానికి చెందిన 50 వైసీపీ కుటుంబాలు శనివారం టీడీపీలో చేరాయి. టీడీపీ సీనియర్ నాయకుడు కొళ్ల అప్పలనాయుడు ఆధ్వర్యంలో వీరంతా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరినవారిలో కురిటి సీతారాం, ఢిల్లీశ్వరరావు, నాగరాజు, రమణ, రాంబాబు, కనకం, కనుగుల దాలినాయుడు, చంటి, బలగ రాజారావు, వరహాలునాయుడు, బేత అప్పారావు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గట్టి భాను, గట్టి రఘుబాబు, చిత్తారపురం పంచాయతీ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల ప్రాంగణంలో పశువులు

రేగిడి: చిన్నశిర్లాం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణం అపరిశుభ్రంగా కనిపిస్తోంది. పాఠశాల ముందే పశువులు, చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. విద్యార్థులు అనారోగ్యం బారిన పడకముందే అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



చిన్నశిర్లాం పాఠశాల ఆవరణలో పశువులను కట్టిన దృశ్యం

విద్యుత్తు సరఫరాలో హెచ్చుతగ్గులు

- కాలిపోతున్న విద్యుత్తు ఉపకరణాలు
- భయాందోళనలో వినియోగదారులు

భోగాపురం: భోగాపురం గ్రామంలో విద్యుత్తు సరఫరాలో నిరంతరం హెచ్చు తగ్గులు రావడంతో వినియోగదారులు భయాందోళన చెందుతున్నారు. గత కొన్ని నెలలుగా విద్యుత్తు సరఫరాలో హెచ్చుతగ్గులు వస్తూనే ఉన్నాయి. దీనికారణంగా ఇళ్లలోని ఫ్యాన్లు, టీవీలు, కంప్యూటర్లు వంటి విద్యుత్ ఉపకరణాలు కాలిపోతున్నాయి. రాత్రి సమయంలో మరీ ఎక్కువగా విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు వస్తున్నాయి. దీంతో విద్యుత్ సామగ్రి కాలిపోయే అవకాశం ఉందని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై అనేక పర్యాయాలు విద్యుత్తు సిబ్బందికి ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. విద్యుత్ హెచ్చుతగ్గుల కారణంగా విద్యుత్ సామగ్రి కాలిపోతే సంబంధిత అధికారులే నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఫిర్యాదు చేస్తామన్నారు. ఇప్పటికైనా విద్యుత్తు అధికారులు స్పందించి విద్యుత్తు సరఫరాలో హెచ్చుతగ్గులు లేకుండా సరఫరా చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని విద్యుత్తు వినియోగదారులు కోరుతున్నారు. ● దీనిపై విద్యుత్తు శాఖ ఏఈ మస్తాన్ వల్లిని వివరణకోరగా లైన్‌మెన్‌కి చెప్పి సమస్య పరిష్కరించేలా చేస్తామని తెలిపారు.

క్లుప్తంగా..

17న ఎస్ఎంసీ ఎన్నిక



రేగిడి: తునివాడలో నోటిఫికేషన్ జారీచేస్తున్న సిబ్బంది

మెంటాడ: మండలంలోని పెదమేడపల్లి మోడల్ స్కూల్ ఎస్ఎంసీ ఎన్నిక ఈనెల 17న నిర్వహించనున్నట్టు ఎంఈవో యూవీఎస్‌పీ వర్మ చెప్పారు. ఇటీవల జరిగిన కమిటీ ఎన్నికల్లో విద్యార్థుల తల్లిదండ్రుల కోరం సరిపడనందున ఎన్నిక వాయిదా పడిందని అన్నారు. 66 పాఠశాలకు కమిటీ ఎన్నికలు పూర్తయ్యాయని చెప్పారు. ● **రేగిడి:** తునివాడ, మునకలవలస, సోమరాజుపేట, చిన్నశిర్లాం పాఠశాల కమిటీలకు ఈనెల 17న ఎన్నిక నిర్వహించనున్నట్టు ఎంఈవోలు వరప్రసాదరావు, ఎరకయ్య తెలిపారు. ఈమేరకు శనివారం ఆయా పాఠశాలల వద్ద రీషెడ్యుల్ నోటిఫికేషన్‌ను ప్రదర్శించారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

బొబ్బిలి రూరల్: కోమటిపల్లి గ్రామంలోని మహాత్మా జ్యోతిబా పూలే ఆశ్రమ పాఠశాలలో శనివారం విద్యార్థులు మొక్కలు నాటారు. బొబ్బిలి గ్రీన్ బెల్ట్ సొసైటీవారు పంపిణీ చేసిన మొక్కలను భౌతిక శాస్త్ర ఉపాధ్యాయురాలు భారతి ఆధ్వర్యంలో నాటారు. ఈ కార్యక్రమంలో ధనంజయనాయుడు పాల్గొన్నారు.

వృద్ధులకు బియ్యం పంపిణీ



బియ్యం అందుకున్న వృద్ధులు

బొబ్బిలి/రూరల్: హేండ్ ఇన్ హేండ్ సొసైటీ బొబ్బిలి సమన్వయకర్త కె.జయబాబు ఆధ్వర్యంలో శనివారం అలజంగి, గాదెలవలస, పెంట, వెలగవలస, పాత బొబ్బిలి తదితర గ్రామాల నిరుపేద వృద్ధులు, వికలాంగులకు, మహిళలకు 10 కేజీల చొప్పున బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

కొమరాడ ఏజెన్సీలో భారీ వర్షం

కొమరాడ: కొమరాడ ఏజెన్సీలో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ప్రధానంగా ఖరీఫ్ సాగు చేస్తున్న పత్తి, వరి పంటలకు ఉపయోగంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. రైతులు వరి నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్న తరుణంలో భారీ వర్షాలు కురవడంతో చెరువుల్లో నీరు చేరింది. దీంతో రైతులు దమ్ములు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు.

విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి

గుమ్మలక్ష్మీపురం: పాఠశాలలో వసతుల కల్పనకు, విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి చేస్తానని గుమ్మలక్ష్మీపురం హైస్కూల్ కమిటీ ఛైర్మన్ శొంఠ్యాన రాజేష్ తెలిపారు. శనివారం గుమ్మలక్ష్మీపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సహకారంతో పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని చెప్పారు. పాఠశాలలో విద్యార్థుల ఎనరోల్‌మెంట్ పెరగడానికి కూడా ప్రయత్నిస్తానని తెలిపారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

- జిల్లా వ్యాప్తంగా సంఘ పతాకాల ఆవిష్కరణ

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆవిర్భవించి అర్ధ శతకం పూర్తయిన సందర్భంగా జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా ఉత్సవాలు నిర్వహించారు. యూటీఎఫ్ జెండాను ఎగురవేసి, సెల్యూట్ చేశారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల శ్రేయస్సుతో పాటు విద్యార్థులకు అత్యుత్తమ బోధనే ప్రధాన ధ్యేయంగా యూటీఎఫ్ నడుస్తోందన్నారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



రాజాం: యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం



గజపతినగరం: నినాదాలు చేస్తున్న యూటీఎఫ్ నాయకులు



గరివిడి: సీఐటీయూ కార్యాలయం వద్ద..



కొత్తవలస: యూటీఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు



బొబ్బిలి: సీబీఎం బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో..

ఇలా అయితే రోగాలు రావా?

- డ్రైనేజీ వ్యవస్థ లేని కొత్తశ్రీరంగరాజపురం
- వీధుల్లోనే నిల్వ ఉంటున్న మురుగు
- చర్యలు తీసుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

గజపతినగరం: మండలంలోని కొత్త శ్రీరంగరాజపురం గ్రామంలో డ్రైనేజీలు లేక వీధుల్లోనే మురుగునీరు పేరుకుపోతోంది. దీంతో వ్యాధుల బారిన పడాల్సి వస్తోందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పాతశ్రీరంగరాజపురం శివారు గ్రామం అయినప్పటికీ 2019లో కొత్తగా పంచాయతీగా ఏర్పాటయ్యింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ గ్రామం ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదు. గ్రామస్థులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. గ్రామానికి సరైన రోడ్డు గానీ వీధి కాలువలు గానీ లేవు. వర్షా కాలంలో వచ్చిందంటే గ్రామమంతా అధ్వానంగా మారుతుంది. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఎక్కడిక్కడే మురుగు నిలిచిపోతోంది. దీంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ నాయకులు గ్రామాన్ని సందర్శించినప్పుడు హామీలు ఇవ్వడం తప్ప అమలు చేయడం లేదని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా గ్రామంలో డ్రైనేజీ ఏర్పాటుకు నిధులు మంజూరు చేసి, గ్రామాభివృద్ధికి సహకరించాలని గ్రామస్థులు ముక్తకంఠంతో కోరుతున్నారు.



డ్రైనేజీ లేక వీధుల్లో ప్రవహిస్తున్న మురుగు